సాక్షి
అనంతపురం
మంగళవారం । 16 । జూలై । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.48

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.48 పలికింది. మార్కెట్‌కు 150 టన్నుల సరుకు వచ్చింది.



జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో జడితో కూడిన తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

డిగ్రీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వర్సిటీలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానభూమి పోర్టల్‌లో ఫలితాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ దరఖాస్తుకు ఈ నెల 31 తుది గడువుగా నిర్దేశించామన్నారు. మొత్తం 10,906 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 8,468 (77.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బీఏ కోర్సులో 908 మందికి గానూ 621 మంది (68.39 శాతం), బీబీఏలో 871 మందికి 436 మంది (50.06 శాతం), బీసీఏలో 28 మందికి 27 మంది, బీకాంలో 4,621 మందికి 3,051 మంది, బీఎస్సీ 4,478 మందికి 4,333 (96.76 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఫలితాల ప్రకటన కమిటీ సభ్యులు ప్రొఫెసర్ జి. శోభాలత, డాక్టర్ పి. శంకరయ్య, డాక్టర్ డి. జయరామి రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు


అనంతపురం అర్బన్: రైతులకు ఆయిల్ పామ్ సాగు లాభాలు తెచ్చిపెడుతుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బొమ్మనహాళ్,డి. హీరేహాళ్, కణేకల్లు, కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి పథకం అనుసంధానంతో వంద శాతం బోర్‌వెల్, డ్రిప్ సదుపాయం ఉన్న రైతుకు రెండు నుంచి నాలుగు హెక్టార్ల వరకు ఆయిల్ పామ్ సాగుకు అవకాశం కల్పిస్తారన్నారు. రియా కంపెనీ, ఎంఏ, ఆగ్రోటెక్ కంపెనీ, ఆయిల్,గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు రైతులకు సహకారం అందిస్తాయన్నారు.

వివరాలకు సంప్రదించండి

ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి వివరాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని ఉద్యాన శాఖ డీడీ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. అనంతపురం డీహెచ్‌ఓ 7995086792, ఉరవకొండ ఉద్యాన అధికారి 799086998, రాయదుర్గం ఉద్యాన అధికారి 7995086997 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

ఊదరగొట్టారిలా..

"కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ప్రతి కుటుంబంలో చదువుకున్న వారికి ఉద్యోగం కల్పిస్తాం. ఉద్యోగం వచ్చేవరకూ ప్రతినెలా రూ. 3 వేలు భృతి ఇస్తాం.." ఇటీవల ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మొదలు గ్రామాల్లో ఉండే టీడీపీ నాయకుల వరకూ చెప్పిన మాటలివి. కూటమి పార్టీలు ఈ అంశాన్ని తమ మేనిఫెస్టోలో సైతం పెట్టాయి. అయితే, అధికార పగ్గాలు చేపట్టి నెలన్నరవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదు.



● కొలువు చూపండి.. భృతి అయినా ఇవ్వండి

ఎదురు చూస్తున్నాం..

- ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఆశలు కల్పించిన చంద్రబాబు
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ
- అప్పటిదాకా నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ. 3 వేలు ఇస్తామని భరోసా
- 'భృతి'పై ఆశలు పెట్టుకుని పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత
- అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటనా చేయని ప్రభుత్వం
- గతంలోనూ రూ. 2 వేలు భృతి ఇస్తామంటూ మమ అనిపించిన వైనం
- మారానన్న బాబు మాట నిలబెట్టుకోవాలంటున్న నిరుద్యోగులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని చంద్రబాబు చెప్పిన మాటలకు ఆశ పడి చాలామంది నిరుద్యోగులు ప్రభుత్వ కొలువులు దక్కించుకునేందుకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. నోటిఫికేషన్ల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా చంద్రబాబు 'భృతి' ఇస్తాడనే నమ్మకంతో నగరాలకు వచ్చి శిక్షణ కొనసాగిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం భృతి విషయంలో ఏ ఒక్క ప్రకటనా చేయకపోవడంతో వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పాత రోజులు గుర్తు చేసుకుంటూ..

జిల్లాలో లక్షలాదిమంది నిరుద్యోగులను 2014–19లో చంద్రబాబు మోసం చేశారు. అప్పట్లోనూ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి గద్దె నెక్కిన ఆయన ఆ తర్వాత పెడచెవిన పెట్టారు. తీరా ఎన్నికల సమయంలో యువతను ప్రసన్నం చేసుకునేందుకు తూతూమంత్రంగా అమలు చేశారు. మూడంటే మూడు నెలలు మాత్రమే సాయం చేశారు. రెండు నెలలు రూ. వెయ్యి, మూడో నెల రూ. 2 వేలు ఇచ్చారు. 50 నెలలకు పైగా ఇవ్వాల్సిన భృతి కేవలం మూడు నెలలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం ప్రకటించిన రూ. 3 వేల భృతి అమలులో కూడా పాతరోజులు గుర్తుకొస్తున్నాయంటూ నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలి



2019– 2021 సంవత్సరంలో పీజీ పూర్తి చేశా. చంద్రబాబు ఈ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అప్పటి దాకా ప్రతి నిరుద్యోగికీ నెలనెలా రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి.

– నరసింహయాదవ్, ఎంఏ, యాడికి మండలం

'భృతి' అందించాలి



డిగ్రీ, బీఈడీ, డీఈడీ పూర్తి చేశా. ప్రస్తుతం గ్రామంలోనే తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. టీడీపీ, జనసేన కూటమి వారి మేనిఫెస్టోలో చేర్చిన నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి. ఆర్థిక సాయం అందిస్తే నాలాంటి వారికి ఎంతో మేలు కలుగుతుంది. 'జాబు కావాలంటే బాబు రావాలి' అంటూ 2014 ఎన్నికల సమయంలో చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశారు. ఈ సారైనా మాట నిలబెట్టుకోవాలి. – శంకర్ నాయక్, రాయలదొడ్డి, బ్రహ్మసముద్రం మండలం

ఆశతో.. ఆత్రుతగా..



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు వి.ప్రమీల. అనంతపురం రూరల్ మండలం పాపంపేటవాసి. ప్రమీల ఎంఏ, బీఈడీ పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సిన నిరుద్యోగ భృతి కోసం గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. ఒక్క ప్రమీలే కాదు.. జిల్లాలో దాదాపు 5.30 లక్షల మంది యువత సాయం చేయాలని అర్థిస్తున్నారు.

ప్రతి నెలా ఇవ్వాలి



నేను ఎంకామ్ చదివా. ప్రైవేట్ కార్యాలయంలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. చంద్రబాబు ఎన్నికల ముందు ప్రకటించిన 20 లక్షల ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నాం. ఆ ఉద్యోగాలు భర్తీ చేసేదాకా ప్రతినెలా ఇస్తామన్న నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇచ్చి యువతను ఆదుకోవాలి.

– నారాయణస్వామి, ఆకుతోటపల్లి, అనంతపురం రూరల్ మండలం

జిల్లాలో భృతికి అర్హులైన వారి వివరాలు ఇలా...

పీజీ, ఎంటెక్ చేసిన వారు
78,000

డిగ్రీ, బీటెక్, బీఈడీ చేసిన వారు
1,62,000

టీటీసీ చేసిన వారు
28,800

వృత్తి విద్య, ఐటీఐ, డిప్లొమా చేసిన వారు
51,200

ఇతరత్రా విద్యావంతులు
2,10,000

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో భర్తీ చేసిన శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు
24,561

ఆశతో కోచింగ్‌కు వెళ్తున్నారు



చంద్రబాబు ఈ ఎన్నికల ముందు చేసిన ప్రకటనలపై నిరుద్యోగులు చాలా ఆశలు పెట్టుకున్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అప్పటిదాకా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పడంతో కూటమి ప్రభుత్వం రాగానే 'భృతి'పై ఆశతో కోచింగ్‌లకు వెళ్తున్నారు. వారి ఆశలు అడియాసలు చేయకుండా వెంటనే భృతి ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఈ.కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వెంటనే ప్రకటించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటింది. ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు భరోసా ఇస్తూ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు శిక్షణ కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ తల్లిదండ్రులపై ఆధారపడలేక అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం. – నరేష్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రెండు రోజులు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బంగాళాఖాతంతో పాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో సముద్ర మట్టానికి ఎత్తులో ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి, అల్పపీడనాలు ఏర్పడ్డాయన్నారు. వీటి ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయవచ్చన్నారు. ఉరుములతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడవచ్చన్నారు.

25 మండలాల్లో వాన..

అల్పపీడనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు 25 మండలాల పరిధిలో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. కళ్యాణదుర్గం, వజ్రకరూరు, బొమ్మనహాళ్, గుంతకల్లు, డి.హీరేహాళ్, యాడికి, తాడిపత్రి, విడపనకల్లు, బ్రహ్మసముద్రం, గుత్తి,పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం, అనంతపురం, ఆత్మకూరు, పెద్దవడుగూరు, గుత్తి, గార్లదిన్నె తదితర మండలాల్లో వర్షపాతం నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా ఇప్పటి వరకు 12.4 మి.మీ నమోదైంది. వర్షాలతో ఖరీఫ్‌లో కదలిక రానుంది. ముందస్తుగా వేసిన పంటలకు ఈ వర్షం ఉపయోగపడనుంది. కనీసం 20 మి.మీ లేదంటే జడివాన పడిన ప్రాంతాల్లో విత్తనాలు విత్తుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈనెల 15తో అదును ముగిసిపోగా, ఈ నెలాఖరు వరకు విత్తనాలు వేసుకున్నా ఇబ్బంది ఉండదని సూచిస్తున్నారు.

టీబీ డ్యాంలో 33 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో నీరు 33.074 టీఎంసీలకు చేరింది. సోమవారం ఉదయం 16,142 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 10 రోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 33.074 టీఎంసీల వరకూ నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,607.59 అడుగులకు నీరు చేరాయి. అవుట్‌ఫ్లో 211 క్యూసెక్కులు నమోదవుతోంది. జలాశయానికి ఎగువన శివమొగ్గ, శృంగేరి, తీర్థనహళ్లి తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డ్యాంకు వరద నీరు ఆశించిన స్థాయిలో రావడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

అర్జీలకు పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 395 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రజల నుంచి అందే అర్జీలకు కచ్చితమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీసీఓ మురళీ కృష్ణ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 395 వినతులు అందాయి. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులతో మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కానిదైతే అదే విషయాన్ని వారికి తెలియజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అర్జీల పరిష్కారంపై అధికారులు రోజూ తమ శాఖ సిబ్బందితో సమీక్షించుకోవాలని చెప్పారు. సమస్యలను గడువుకంటే ముందే పరిష్కరించాలని సూచించారు.

వినతులు కొన్ని

- ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదని నార్పల మండలం కురగానిపల్లికి చెందిన ఎ.వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. స్తంభాలు, తీగ ఇచ్చారే తప్ప ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదన్నారు. విద్యుత్ అధికారులు ఈ రోజు, రేపు అంటూ తిప్పుకుంటున్నారని చెప్పారు. పంట పెట్టుకోవడానికి ఇబ్బంది ఉందని, సమస్య పరిష్కరించాలని కోరారు.
- పింఛను మొత్తం పెంచాలని యాడికి మండలం చందన గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ఎస్.వసుంధర విన్నవించారు. భర్త కూడా దివ్యాంగుడని తెలిపారు. తనకు వైకల్యం 81 శాతం ఉందని, నడవలేని స్థితిలో ఉన్నానని చెప్పారు. ప్రస్తుతం రూ.6 వేలు వస్తోందని, ఆ మొత్తం రూ.15 వేలు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆదుకోండి సార్



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన చిట్టి (మానస)

ఈ అమ్మాయి పేరు చిట్టి (మానస). మాటలు రావు. విడపనకల్లు మండలం హావళిగి ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి పాతమిద్దె కూలి మరణించిన కొనప్పగారి మారెప్ప, లక్ష్మి దంపతుల కుమార్తె. ప్రమాదంలో చిట్టి చేయి విరిగింది. కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వం నుంచి సహాయం అందించి ఆదుకోవాలని కోరేందుకు చిట్టిని ఆమె చిన్నమ్మ సరోజ, చిన్నాన్న రాము తీసుకొచ్చారు. చిట్టి పరిస్థితిపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. వైద్య సదుపాయం, సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తల్లితో సంబంధం.. కుమార్తెపై అత్యాచారం

- తల్లి నుంచి అతనికి..అతని నుంచి కుమార్తెకు హెచ్ఐవీ
- ఇప్పటికే తల్లి మృతి
- అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు
- అధికారుల సంరక్షణలో బాధిత బాలిక



హిందూపురం అర్బన్: భర్త చనిపోవడంతో తనకొక తోడు కావాలనుకున్న ఆమె మరొక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తనకు హెచ్ఐవీ ఉందన్న విషయాన్ని దాచిపెట్టి అతనితో సహజీవనం చేసింది. దీంతో అతనికీ వైరస్ సోకింది. ఆరోగ్యం విషమించి కొంతకాలం క్రితం ఆమె చనిపోయింది. అయినప్పటికీ ఆమె కుమార్తె అతన్నే తండ్రిగా భావించి కలసి ఉండేది. దీన్ని ఆసరాగా చేసుకున్న ఆ నీచుడు మృగాడిలా మారాడు. కన్న బిడ్డ లాంటి బాలికపై అత్యాచారం చేశాడు. అన్యంపుణ్యం ఎరుగని ఆ బాలికకూ వ్యాధి అంటించాడు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. పోలీసుల కథనం మేరకు.. హిందూపురం పట్టణంలోని రహమత్‌పూర్‌కు చెందిన సుమారు 53 ఏళ్ల వ్యక్తికి ముద్దిరెడ్డిపల్లిలో ఉండే మహిళ పరిచయమైంది. అప్పటికే ఆమెకు వివాహమై.. అనారోగ్యంతో భర్త చనిపోయాడు. కుమార్తె ఉంది. ఆమె నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న సదరు వ్యక్తి అన్నివిధాలా అండగా ఉంటానని నమ్మించాడు. ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఆమెకు అప్పటికే హెచ్ఐవీ ఉన్నప్పటికీ ఆమె కూడా ఆ విషయాన్ని దాచిపెట్టి అతనితో సహజీవనం చేసింది. అతను, ఆమె, ఆమె కుమార్తె ముగ్గురూ కలసి రెండేళ్లుగా స్థానిక మోడల్ కాలనీలో ఉండేవారు. వ్యాధి ముదరడంతో కొంతకాలం క్రితం ఆమె చనిపోయింది. ఇక ఏ దిక్కూలేని 14 ఏళ్ల కుమార్తె అతని వద్దే ఉండిపోయింది. అతను కూడా కొన్ని రోజుల తర్వాత అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో సదరు బాలిక ప్రతినెలా బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించేది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూన్ పదో తేదీన బత్తలపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యులు అనుమానంతో అతనికి హెచ్ఐవీ పరీక్ష చేయించారు. అతనికీ వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. వెంట తీసుకువచ్చిన బాలికకు కూడా వైద్యపరీక్షలు చేయించగా.. ఆమెకూ వ్యాధి సోకినట్లు తేలింది. అతను తనను నమ్మించి పలు మార్లు అత్యాచారానికి పాల్పడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె వైద్యులకు తెలిపింది. దీంతో ఆర్డీటీ వైద్యులు బత్తలపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే అతను తప్పించుకుని వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బత్తలపల్లి పోలీసులు.. ఈ కేసును హిందూపురం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఆర్డీటీ సహకారంతో బాధితురాలిని బాలికా సంరక్షణ విభాగం అధికారులకు అప్పగించారు. తరువాత ఓ పాఠశాలలో చదువుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా..నిందితుడు హిందూపురం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో ఈ నెల 13న పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్ట్ చేసి.. రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఏపీ రీసెట్‌లో మొదటి ర్యాంకు



సాయి సుష్మ

అనంతపురం: ఇటీవల విడుదలైన ఏపీ రీసెట్ –2024 ఫలితాల్లో నగరానికి చెందిన ఓ యువతి సత్తా చాటింది. ఇంగ్లిష్ విభాగంలో సాకే సాయి సుష్మ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకుంది. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో సాకే సాయి సుష్మ ఎంఏ ఇంగ్లిష్ చదివారు. ఈమె తండ్రి సాకే నారాయణ స్వామి న్యాయవాది. తల్లి ఉషాకుమారి ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.



పీర్ల దేవున్ని ఎత్తుకొని అగ్ని గుండంలో పడిపోయిన లక్ష్మీనారాయణ

అగ్ని గుండంలో పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

విడపనకల్లు: అగ్ని గుండంలో పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని పాలికి గ్రామంలో జరిగింది. వివరాలు.. పాలికి గ్రామంలో చిన్న సరిగెత్తు సందర్భంగా సోమవారం తెల్లవారుజామున పీర్ల దేవుళ్లను ఊరేగించారు. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పీర్ల దేవున్ని ఎత్తుకుని అగ్ని గుండం దాటే క్రమంలో అకస్మాత్తుగా పడిపోయాడు. స్థానికులు వెంటనే అగ్ని గుండంలో నుంచి లక్ష్మీనారాయణను బయటకు లాగారు. అప్పటికే ఆయన కాళ్లు, చేతులు తీవ్రంగా కాలి గాయాలయ్యాయి. వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు.



కాలిన గాయాలతో ఆస్పత్రిలో బాధితుడు

క్లుప్తంగా

'పోలీస్ స్పందన'కు 106 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీలు

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 106 వినతులు అందాయి. ప్రజల నుంచి అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ నేరుగా అర్జీలు స్వీకరించి, సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. పరిశీలన అనంతరం సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఫోన్ ద్వారా ఆదేశించారు.

108లో ప్రసవం



శిశువును చూపుతున్న ఈఎంటీ అనిత

గార్లదిన్నె: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే 108 అంబులెన్స్‌లో మగశిశువుకి జన్మనిచ్చింది. వివరాలు.. గార్లదిన్నె మండలం పాత కల్లూరుకు చెందిన కృష్ణవేణికి ఆదివారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని గర్భిణిని తీసుకుని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి బయలుదేరారు. మార్గం మధ్యలో రాత్రి 11 గంటల సమయంలో వడియంపేట వద్దకు రాగానే నొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఈఎంటీ అనిత కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు కృష్ణవేణి జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించారు.

సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించిన ఎంపీ



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ ఎస్ఏ కోరి

అనంతపురం/బుక్కరాయసముద్రం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించారు. జేఎన్‌టీయూ (ఏ)లోని ఇంక్యుబేషన్ కేంద్రంలో ఉన్న వైస్ చాన్సలర్ కార్యాలయంలో ఆయనకు వీసీ ఎస్ఏ కోరి సాదర స్వాగతం పలికారు. 2018లో వర్సిటీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకూ సాధించిన పురోగతిని వివరించారు. జంతలూరు వద్ద ఏర్పాటు చేయబోయే శాశ్వత క్యాంపస్‌పై చర్చించారు. ఆగస్టు నుంచి శాశ్వత క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తామని వీసీ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి అదనంగా 12 కొత్త కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరు సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టామన్నారు. ప్రస్తుతం 20 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వర్సిటీలో చదువుతున్నారని పేర్కొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. మైనింగ్, సోషియాలజీ, టెక్స్‌టైల్స్, జియాలజీ, ఆంత్రోపాలజీ వంటి కోర్సులూ ప్రవేశపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ ప్రొఫెసర్ సి.షీలారెడ్డి, పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ యు.ఉమేష్‌కుమార్ పాల్గొన్నారు.

హరిత అనంతనే లక్ష్యం

- అభివృద్ధి పనులు సత్వరమే చేపట్టాలి
- దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అందజేత
- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: హరిత 'అనంత' లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'మన పచ్చని అనంతపురం కోసం..' పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల అందజేత

దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల పంపిణీ అంశంపై విస్తృత అవగాహన కల్పించాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు మంజూరైన కృత్రిమ కాళ్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆయన అందజేశారు. పుట్లూరు మండలం కందిగోపుల గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటరామయ్యకు స్వయంగా కృత్రిమ కాలును కలెక్టర్ అమర్చారు. చంక కర్రలనూ అందజేశారు. ఆత్మకూరు మండలం బి.యాలేరుకు చెందిన ఓబుళమ్మకు, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన భాగ్యమ్మకు కృత్రిమ కాళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు ప్రారంభించండి

జిల్లావ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో అర్ధంతరంగా నిలిచిన అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఎన్ఆర్ఈజీఎస్, ఎస్డీపీ, 15వ ఫైనాన్స్ ద్వారా చేపట్టిన అంగన్‌వాడీ భవనాలు, పాల శీతలీకరణ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, సీసీరోడ్లు, రహదారుల నిర్మాణానికి సంబంధించిన పనులు మొదలు పెట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ నెల 20వ తేదీలోపు పీఎంజీఎస్‌వై కింద రాయదుర్గం-భూపసముద్రం, ఉరవకొండ-కణేకల్లు తదితర రహదారుల నిర్మాణం ప్రారంభించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ఉపాధి పథకం కింద చేపట్టిన పనులూ కొనసాగించాలని, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పనులనూ పూర్తి చేయాలని సూచించారు. రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ క్రమంలోఅలసత్వానికి తావివ్వకూడదన్నారు. సమావేశంలో పీఆర్ ఎస్ఈ కేవీకేవిప్రసాద్, ఈఈ చంద్రశేఖర్, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

హరిత అనంతకు కృషి చేయాలి

అనంతపురం మెడికల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా హరిత అనంతకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో సోమవారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొక్క నాటి నీళ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటించాలని డీఎంహెచ్ఓకు సూచించారు. ప్రధానంగా విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యతను తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. అనంతరం మొక్కలను బిడ్డలతో సమానంగా కాపాడుతానని, మొక్కల ఫలాలను దేశానికి చేకూరేలా చేస్తానని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్ రావు, మలేరియా అధికారి ఓబులు, స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్ రఫి, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనాధికారి గంగాధర్, సూపరింటెండెంట్లు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, సురేష్‌కుమార్, పవన్, కమలాకర్ రాజు, లక్ష్మణ్ణ, తదితరులు పాల్గొన్నారు.

బయోటెక్నాలజీ కంపెనీల ఏర్పాటుకు చర్యలు

రాప్తాడు: ఎలైట్ బయోటెక్నాలజీస్ లాంటి కంపెనీలు మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలోని ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కులో ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో పారిశ్రామికవేత్త రాఘవేంద్ర ఏర్పాటు చేసిన ఎలైట్ బయోటెక్నాలజీస్ ల్యాబ్ (అరటి పిలకల ఉత్పత్తి కేంద్రం)ను కలెక్టర్ పరిశీలించి, మాట్లాడారు. రాష్ట్రంలో అరటి ఉత్పత్తిలో అనంతపురం జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఇక్కడి అరటి ఉత్పత్తులు విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయన్నారు. ఈ క్రమంలో ఎలైట్ బయోటెక్నాలజీస్ లాంటి కంపెనీల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. పారిశ్రామికవేత్త రాఘవేంద్రను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథరెడ్డి, మండల ఉద్యాన అధికారి రత్నకుమార్, ఎలైట్ బయోటెక్నాలజీస్ ప్రమోటర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక మన్నికకు పేరెన్నిక భారతీ సిమెంట్

- భారతీ సిమెంట్ కంపెనీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి



డీలర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం రూరల్: కట్టడాల దీర్ఘకాలిక మన్నికకు భారతీ సిమెంట్ పేరెన్నికగన్నదని భారతీ సిమెంట్ కంపెనీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఎంసీ మల్లారెడ్డి అన్నారు. సోమవారం అనంతపురంలోని ఓ ప్రముఖ హోటల్‌లో అనంతపురం జిల్లాలోని భారతీ సిమెంట్ కంపెనీ డీలర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. నిర్మాణ రంగంలో ఎక్కువ శాతం మంది ఇంజినీర్లు భారతీ సిమెంట్‌నే ఎంపిక చేస్తున్నారన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగని విధంగా ఉత్పత్తి చేపట్టినట్లు వివరించారు. పూర్తి స్థాయి జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను కలిగి ఉన్నట్లు తెలిపారు. అనంతరం డీలర్లను ఘనంగా సన్మానం చేసి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ కొండల్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బరాయుడు, టెక్నికల్ సర్వీస్ టీమ్ సభ్యులు ఓబుల్‌రెడ్డి, విజయ్‌కుమార్ నాయక్, మోతీలాల్ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ స్కూళ్లకే పరిమితం చేయాలి

- గిరిజన ఉపాధ్యాయ సంఘం డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: 'తల్లికి వందనం' పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రాథమిక విద్య 1 నుంచి 5వ తరగతి వరకు మూడు కిలోమీటర్ల పరిధిలో, ప్రాథమికోన్నత విద్య 5 కిలోమీటర్ల పరిధిలో ఉండాలన్నారు. విద్యా సంస్కరణలో భాగంగా జారీ చేసిన జీఓ 117తో 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత స్థాయిలో చేర్చారన్నారు. దీనివల్ల ప్రాథమిక విద్యా విచ్ఛిన్నం అవుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే జీఓ 117 రద్దు చేసి తీరుతామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ చాలా సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెన్నెళ్లవుతున్నా ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంగ్లిష్ మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియంనూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో అమలు చేయాలని కోరారు.

అయ్యవారూ.. మీ జాడెక్కడ?



ఎప్పుడు చూసిన ఖాళీగానే కనిపించే ప్రిన్సిపాల్ కుర్చీ



హాజరు పట్టీలో ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు కనిపించని ప్రిన్సిపాల్ సంతకాలు

- విధులకు డుమ్మాకొడుతున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్
- విద్యాసంవత్సరం ఆరంభం నుంచి కానరాని వైనం

కణేకల్లు: అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దారి తప్పారు. ప్రతి నెలా జీతం తీసుకుంటూనే విధులను నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు. స్కూల్ ప్రారంభమై నెలరోజులైనా ఇప్పటి వరకూ ఆయన పాఠశాల వైపు కన్నెత్తి కూడా చూడ లేదు. ఈ విషయం జిల్లా విద్యాశాఖాధికారికి తెలిసినా... చర్యలకు వెనుకాడడం గమనార్హం.

ఆడిందే ఆట...

కణేకల్లులోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదినారాయణ ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. 2022, మే 14న బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. అప్పటి నుంచి కూడా ఆయన విధులకు సక్రమంగా హాజరైంది లేదు. చుట్టపు చూపుగా రావడం... హాజరు పట్టీలో సంతకాలు చేసేసి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. ప్రస్తుత విద్యాసంవత్సరం ఆరంభమై 45 రోజులు గడుస్తున్నా... ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. పర్యవేక్షణ చేయాల్సిన ప్రిన్సిపాలే లేకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది అనేక అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ లెక్చరర్లు 15 మంది ఉండగా, కాంట్రాక్టర్ లెక్చరర్లు 5 మంది, నాన్ టీచింగ్ స్టాఫ్ 7 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ లేకపోవడంతో పాఠశాల అడ్మినిస్ట్రేషన్ సైతం గాడి తప్పింది. దీంతో అయ్యవారో.... మీ జాడెక్కడ? అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరా తీయడం మొదలు పెట్టారు.

ఫోర్జరీ సంతకాలతో సరి

ప్రిన్సిపాల్ ఆదినారాయణపై ఎంతో విశ్వాసం చూపే ఓ లెక్చరర్ ఆయనకు ఎలాంటి కష్టం రానివ్వకుండా కాపాడుకొస్తున్నట్లు సమాచారం. ప్రిన్సిపాల్‌తో పాటు సదరు లెక్చరర్ కూడా ఒకేసారి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అప్పటి నుంచి ఆయన ప్రిన్సిపాల్‌కు విధేయుడిగా ఉంటూ వస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. చివరకు ఇంటర్, టిన్ టీసీలు కొన్నింటిపై ఆయనే సంతకాలు చేసి, మంజూరు చేసినట్లు సమాచారం. విద్యార్థుల బస్సు పాసులు, ఉద్యోగుల జీతాల బిల్లులు, మోడల్ స్కూల్ హాస్టల్ డైట్ బిల్లులపై కూడా ఆయన ప్రిన్సిపాల్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇచ్చినట్లుగా ఆరోపణలున్నాయి. జూన్ 1వ తేది నుంచి 11వ తేదీ వరకూ ప్రిన్సిపాల్ డ్యూటీకి రాకపోయినా ఆయా తేదీల్లో విధులకు హాజరైనట్లు హాజరు పట్టీలో ప్రిన్సిపాల్ సంతకాన్ని సైతం చేసినట్లు తెలిసింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతరులెవరైనా ఏపీ మోడల్ స్కూల్‌కెళ్లి ప్రిన్సిపాల్ ఎక్కడ అంటే... సార్ ఇంకా రాలేదు! దారి మధ్యలో ఉన్నారు... వస్తున్నారు... అని చెప్పడం సిబ్బందికి పరిపాటిగా మారింది. ఏ టైమ్‌లో వెళ్లినా సిబ్బంది చెప్పేది ఇవే డైలాగులు. మధ్యాహ్నం వెళ్లి అడిగితే ఇప్పుడే సార్ ఆఫీస్ పనిపై అనంతపురానికి వెళ్లిపోయారు అని సమాధానమిస్తున్నారు.

పుష్కలంగా ఉన్నతాధికారుల ఆశీస్సులు

ప్రిన్సిపాల్ ఆదినారాయణకు విద్యాశాఖలో మంచి పలుకుబడి ఉన్నట్లుగా తెలుస్తోంది. డీఈఓ నుంచి ఆర్జేడీ కార్యాలయ వరకూ అధికారులంతా ఆయనకు అత్యంత విశ్వాస పాత్రులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తనపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు భారీగా ముడుపులు చెల్లిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్, డీఈఓ స్పందించి ప్రిన్సిపాల్ పై శాఖపరమైన చర్యలు తీసుకుని పాఠశాల నిర్వహణను గాడిలో పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రచార ఆర్భాటం.. విక్రయాలు శూన్యం!



రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం

అనంతపురం అగ్రికల్చర్: బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకే నాణ్యమైన సోనా బియ్యం, కంది పప్పు అందిస్తామని గొప్పగా చెప్పి స్థానిక రైతు బజార్‌లో ఈ నెల 11న ప్రారంభించిన విక్రయ కేంద్రానికి ప్రజల నుంచి ఏ మాత్రం స్పందన కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిల్లర్స్ అసోసియేషన్, మర్చంట్ అసోసియేషన్ సహకారంతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విక్రయ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ అర్భాటంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. కిలో రూ.48, రూ.49 ప్రకారం రెండు రకాల బియ్యం, కిలో కంది పప్పు రూ.160 చొప్పున ధరలు నిర్ణయించారు.

బయటి మార్కెట్‌లోనూ అదే ధర

బయటి మార్కెట్‌తో పోల్చుకుంటే ఇక్కడ ఎంత లేదన్నా కిలోపై రూ.15 నుంచి రూ.20 వరకు ధర తక్కువగా ఉంటుందని చెప్పారు కానీ, బహిరంగ మార్కెట్‌లోనూ దాదాపు అవే ధరలకు లభిస్తున్నట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు. కంది పప్పుపై మాత్రం కిలోకు రూ.5 వరకు ఆదా అవుతుందంటున్నారు. .ప్రారంభం రోజు చాలా మంది రావడంతో తొలిరోజు ఓ మాదిరిగా అమ్మకాలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. రెండో రోజు నుంచి ప్రజల నుంచి స్పందన కరువైందంటున్నారు. రోజుకు ఒక క్వింటా బియ్యం, అర క్వింటా కంది పప్పు కూడా అమ్ముడుపోని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కనీసం బియ్యం కిలో రూ.40, కంది పప్పు కిలో రూ.140 ప్రకారం ఉన్నా... కొంత వరకు స్పందన ఉండేదని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొంతైనా రాయితీ భరిస్తే... ఇలాంటి వాటి వల్ల ప్రజలకు ఒకింత ప్రయోజనం చేకూరుతుందంటున్నారు.

17న ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కమిటీ మొదటి కార్యవర్గ సమావేశం ఈ నెల 17న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు నాగరాజు హాజరు కానున్నారు. ఎస్టీయూ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైకల్యం లేకపోయినా అలవెన్స్!

- ఎస్కేయూలో వెలుగు చూస్తున్న అక్రమాలు
- దివ్యాంగులైన ఉద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు అదనపు అలవెన్స్
- దీంతో వైకల్యం లేకపోయినా వికలాంగుల కోటాలో అలవెన్స్ కోసం దరఖాస్తు
- ధ్రువీకరణ పత్రాలు లేకున్నా ప్రతి నెలా 25 మందికి మంజూరు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఎలాంటి వైకల్యం లేకున్నా.. దివ్యాంగుల కోటాలో కొందరు ఉద్యోగులు ప్రతి నెలా అదనపు అలవెన్స్ పొందుతున్నారు. రెండు దశాబ్దాలుగా ఇది కొనసాగుతూ వస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. విషయం వెలుగు చూసిన తర్వాత ఇప్పటి వరకూ దివ్యాంగుల కోటాలో స్వాహా అయిన రూ.1.5 కోట్ల మేర అలవెన్స్‌లను రికవరీ చేయడంలో వర్సిటీ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో బురిడీ

వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎవరికైనా వైకల్యం ఉంటే వారికి ప్రతి నెలా జీతంతో పాటు రూ.2వేలు అలవెన్స్ చెల్లిస్తారు. కేవలం సర్టిఫికెట్ ఇస్తే చాలు.. అలవెన్స్ మంజూరవుతుంది. దీంతో 50 మంది ఉద్యోగులు ఈ కోటా కింద అలవెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే 20 మంది ఉద్యోగ విరమణ చేశారు. మిగిలిన 30 మంది ప్రతి నెలా దివ్యాంగుల అలవెన్స్ పొందుతున్నారు. వీరిలో ఐదుగురు మాత్రమే నిజమైన దివ్యాంగులు. తక్కిన 25 మంది అక్రమంగా ప్రతి నెలా అలవెన్స్ తీసుకుంటున్నారు. 20 సంవత్సరాలుగా ఇదే తరహాలోనే వీరు అలవెన్స్ పొందుతున్నా.. చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనుకంజ వేయడం గమనార్హం.

పదోన్నతుల్లోనూ అక్రమాలే..

దివ్యాంగుల అలవెన్స్ తీసుకునేందుకు నకిలీ సర్టిఫికెట్లు పొందుపరిచిన వారు కనీసం సదరం సర్టిఫికెట్ ఇవ్వకపోవడం గమనార్హం. వర్సిటీలోనే రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగికి వైకల్యం ఉందో.. లేదో అనే అంశాన్ని ఇప్పటి వరకూ ఆయనతో ధ్రువీకరించలేదు. అలవెన్స్‌లను అక్రమంగా అందిపుచ్చుకోవడమే కాక... ఏకంగా పదోన్నతులు పొంది దానికి అనుగుణంగా పెద్ద మొత్తంలో దివ్యాంగ అలవెన్స్ పొందుతున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. వాస్తవానికి 70 శాతం దివ్యాంగులు అయితే అలవెన్స్ మంజూరు చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ చిన్నపాటి గాయమైనా దివ్యాంగులమేనంటూ దరఖాస్తు చేసుకుని అలవెన్స్‌లు స్వాహా చేస్తున్నారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు నకిలీ దివ్యాంగులను గుర్తించి, వారు స్వాహా చేసిన మొత్తాన్ని రికవరీ చేయాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని నందలపాడుకు చెందిన నాగమునిరెడ్డి (45) అప్పులు చేసి లారీలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ వ్యాపారంలో నష్టపోవడంతో అప్పులు తీర్చలేక మదనపడుతూ అనారోగ్యం పాలయ్యాడు. ఈ నేపథ్యంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం తాడిపత్రి రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెల మృతి

ఉరవకొండ: మండలంలోని మైలారంపల్లిలో విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి చెందాయి. బాధిత కాపరి తెలిపిన మేరకు... గ్రామ సమీపంలోని ఓ పొలంలో కాపరి గోవిందు సోమవారం ఉదయం తన గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. మేత మేసే క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుకుని ఉన్న విద్యుత్ స్తంభం తీగలు తగిలి 8 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ.50 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.



క్లుప్తంగా

బాస్కెట్ బాల్ క్రీడాకారుడికి అభినందన



కె.ద్వారకానాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల శ్రీలంకలో జరిగిన ఆసియా కప్–2024 బాస్కెట్ బాల్ పోటీల్లో ఇండియా జట్టు విజేతగా నిలిచింది. ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించి జిల్లాకు వచ్చిన కె.ద్వారకానాథరెడ్డిని మాంటిస్సోరి స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు కలిసి అభినందించారు. ద్వారకనాథ్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని మాంటిస్సోరి విద్యాసంస్థల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు కె.పద్మావతి, ఎ.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతపురం: బాస్కెట్‌బాల్ పోటీల్లో భారత దేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన తొలి అనంతపురం జిల్లా యువకుడిగా ద్వారకనాథ్ రెడ్డి ఖ్యాతి గడించాడు. అనంతకు వచ్చిన ద్వారకనాథ్ రెడ్డిని భారీ గజమాలతో సత్కరించారు.

రాయితీ రుణాలు మంజూరు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ నాయకులు

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాయితీ రుణాలు మంజూరు చేయాలని చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నీలూరు రుషింగప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రుషింగప్ప మాట్లాడుతూ.. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. స్వయం ఉపాధి కల్పనకు రాయితీ రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, సోమశేఖర్, శ్రీనివాసులు, నరసింహులు, విశ్వనాధ, దాసరి గోపాల్, రామచంద్ర, భాస్కర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నివారిద్దాం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు: కుష్టు వ్యాధిపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిద్దాం. సమిష్టి కృషితో కుష్టు వ్యాధిని నివారిద్దామని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి కుష్టు నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు సర్వే జరుగుతుందన్నారు. ప్రారంభ దశలోనే కుష్టు వ్యాధిని గుర్తించి సకాలంలో ఎండీటీ చికిత్సను అందజేస్తే పూర్తిగా నయమవుతుందన్నారు. పుట్టుకతోనే ఉన్న మచ్చలు, వచ్చిపోయే మచ్చలు, పూర్తిగా తెల్లని మచ్చలు, దురద పెట్టే మచ్చల వల్ల అపోహలు పడరాదని సూచించారు. కుష్టు వ్యాధి సూక్ష్మ క్రిముల ద్వారా వస్తుందని తెలిపారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుని ఆహారం తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు నరసింహ, అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు సేవలు స్ఫూర్తిదాయకం



ఎన్‌వైకే అధికారి శ్రీనివాసులును సత్కరిస్తున్న వలంటీర్లు

అనంతపురం కల్చరల్: నెహ్రూ యువకేంద్రం డీడీఓ గోవర్ధన శ్రీనివాసులు యువతను ప్రోత్సహించే విధానం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఇండోర్ స్టేడియం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఇటీవల ఎంపికైన ఎన్‌వైకే అధికారి శ్రీనివాసులు, కార్యదర్శి సుబ్బారావును వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి భరత్, జీవన్‌కుమార్, జయమారుతి, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, మంజు తదితరులు మాట్లాడారు. నెహ్రూ యువకేంద్రం అందించే ప్రోత్సాహం ద్వారా పలువురు రాష్ట్రపతుల చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారని గుర్తు చేశారు. ఎన్‌వైకే అధికారిగా ఉన్నప్పటికీ స్పోర్ట్స్‌పై మక్కువతో క్రీడలను ప్రోత్సహిస్తారన్నారు. ఇండోర్ స్టేడియం మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

నమ్మకాన్ని నిలబెట్టుకోండి



సూపర్ సిక్స్ పథకాలకు ప్రజలు ఆకర్షితులయ్యారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటినా ఇంత వరకు యువతకు ఏమీ చేయలేదు. వాళ్ల ప్రచారాలు, ఆర్భాటాలకే పరిమితం కాకుండా యువతకు ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి అందించాలి. చాలా మంది మండలంలో డిగ్రీలు, పీజీలు చదివి పనులు చేసుకుంటున్నారు. అలాంటి వారిని అధికారులు గుర్తించి నిరుద్యోగ భృతి అందించాలని కోరుతున్నాం.

– వెంకట్రామిరెడ్డి, ఆత్మకూరు

20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారా?



మాది నిరుపేద కుటుంబం. మా తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లి ముగ్గురు కుమారులను చదివించారు. నేను బీకామ్ కంప్యూటర్స్ పూర్తి చేశాను. మా రెండో తమ్ముడు హరికృష్ణ బీఎస్సీ పూర్తి చేశాడు. చివరి తమ్ముడు ప్రకాష్ బీటెక్ పూర్తి చేశాడు. ఒకే ఇంట్లో ముగ్గురు నిరుద్యోగులు చదువు పూర్తి చేసి ఇంటి పట్టునే ఉన్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. మా ఇంట్లో ఒకరికైనా ఉద్యోగం రాదా అని ఎదురు చూస్తున్నాం. మిగతా ఇద్దరికి నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– శ్రీకృష్ణ, మరూరు, రాప్తాడు మండలం

నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు



నేను 2012లో డిగ్రీ పూర్తి చేశాను. దాదాపు 8 ఏళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్నాను. నాలాంటి ఎంతో మంది జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఉలుకుపలుకు లేదు. ఇచ్చిన హామీ మేరకు జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలి. నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి మంజూరు చేయాల్సిందే.

– గోపాలకృష్ణ, బసంపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

రూ.3 వేలు ఇవ్వాల్సిందే..



నేను ఎంబీఏ పూర్తి చేశాను. ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం లేక స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు విస్మరిస్తోంది. ఎన్నికలకు ముందు రూ.3 వేల నిరుద్యోగ భృతి లేదా ఇంటికో ఉద్యోగం అని ఇస్తామని గొప్పలు చెప్పుకున్నారు. ఇప్పుడు హామీల గురించి మాట్లాడక పోవడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిరుద్యోగ భృతి ప్రకటించాలి. అలాగే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

– లోకేష్, గంగినేపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో?

- ఉద్యోగం వచ్చే వరకూ రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు
- గెలిచాక హామీలపై నోరు మెదపని ప్రభుత్వం
- కూటమి తీరుపై నిరుద్యోగుల మండిపాటు

కనగానపల్లి/ఆత్మకూరు/రాప్తాడు/చెన్నేకొత్తపల్లి/రామగిరి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం లేదంటే నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని గొప్పలు చెప్పుకున్నారు. చంద్రబాబుతో పాటు కూటమి నాయకులంతా ఎన్నికల ప్రచారంలో హోరెత్తించారు. కాని అధికారంలోకి నెల రోజులు దాటినా సీఎం చంద్రబాబుతో పాటు ఏ ఒక్కరూ ఈ హామీ అమలుపై మాట్లాడటం లేదు. దీంతో నిరుద్యోగ యువతీ, యువకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా చంద్రబాబు ఈసారి కూడా నిరుద్యోగ భృతి పథకాన్ని చివరిదాకా అమలు చేస్తారా? లేదా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక రాప్తాడు నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 78 వేల కుటుంబాలు, అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో 76,948 కుటుంబాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి లేదంటే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేల ప్రకారం ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



స్పష్టత ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి అమలుపై స్పష్టత ఇవ్వాలి. ప్రభుత్వం వచ్చి నెల రోజులు దాటినా దీనిపై సీఎం చంద్రబాబుతో పాటు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఎటువంటి ప్రకటన చేయలేదు. దీనిపై మా నిరుద్యోగుల్లో అనుమానం రెకెత్తిస్తోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి సీఎం చంద్రబాబు మాట నిలుపుకోవాలి.

– బాలరాజు, పేరూరు, రామగిరి మండలం

ఉపాధి పనులు చేసుకుంటున్నా..



నేను డిగ్రీతో పాటు బీఈడీ, డీఈడీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగం లేక గ్రామంలో ఉపాధి పనులు చేసుకుని జీవిస్తున్నాను. ఎన్నికల ముందు టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే విజయం సాధించి అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ భృతి గురించి మాట్లాడక పోవడం బాధాకరం. ఎప్పటి నుంచి ఇస్తారో వెంటనే చెప్పాలి.

– సురేష్, మేడాపురం, చెన్నేకొత్తపల్లి మండలం

అందరికీ ఇవ్వండి సారూ..



గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏ పథకం అయినా పార్టీలు, కుల, మతాలను చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారు. అదే విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఇవ్వాలి. జన్మభూమి కమిటీల ద్వారా కాకుండా అర్హతను బట్టి యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతున్నాం. గతంలో మాదిరిగా ప్రజలను మోసం చేయకుండా ఇచ్చిన హామీలను నెరవేరిస్తే యువత అందర్నీ స్వాగతిస్తుంది.

– లోకేష్, వేపచెర్ల ఎగువ తండా, ఆత్మకూరు మండలం

హామీ అమలుపై ప్రకటన చేయాలి



నిరుద్యోగ భృతి హామీ అమలుపై చంద్రబాబు ప్రభుత్వం వెంటనే ఒక ప్రకటన చేయాలి. గ్రామాల్లో మాలాంటి నిరుద్యోగ యువకులు దీనికోసం ఎదురు చూస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందిస్తే ఖర్చులకు ఉపయోగపడుతాయి. ఉద్యోగాల కోసం సన్నద్ధం అవుతాను.

– సాకే హరీష్, రామగిరి మండలం

నిరుద్యోగులను మోసం చేయొద్దు



చంద్రబాబు నిరుద్యోగులను మోసం చేయకుండా ఇచ్చిన హామి మేరకు వెంటనే జాబ్ క్యాలండర్ అయినా విడుదల చేయాలి, లేదంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అయినా అందించాలి. గతంలో రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు ఎన్నికల ముందు 2, 3 నెలలు ఇచ్చి మోసం చేశారు.

– నరసింహులు, శేషంపల్లి, రామగిరి మండలం

ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు!



ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు నాయుడు చాలా హామీలు ఇచ్చారు. అందులో భాగంగా నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేంత వరకూ రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. నిరుద్యోగ భృతిపై మండలంలో చాలా మంది నిరుద్యోగులు ఆశతో ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వెంటనే రూ.3 వేల చొప్పున అందించాలి.

– అశోక్, మదిగుబ్బ, ఆత్మకూరు మండలం

అనంతపురం అర్బన్, రాప్తాడు నియోజకవర్గాల సమాచారం

మండలం	ఇళ్ల సంఖ్య
అనంతపురం అర్బన్ నియోజకవర్గం	76,948
రాప్తాడు	11500
కనగానపల్లి	11,200
ఆత్మకూరు	11,100
చెన్నేకొత్తపలి	12,200
రామగిరి	9,800
అనంతపురం రూరల్	22,200
మొత్తం	1,54,948

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి




మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి ప్రజా ప్రతినిధులను కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నిలిచిన అభివృద్ధి పనులు ఇక నుంచి జరగాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. అదేవిధంగా అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా విధులకు హాజరుకావాలన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం అందేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వర్షా కాలంలో కరెంట్ కోతలు లేకుండా చూడాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సర్వ సభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వినిపించారు.

పోలీసుల పహారా..

టీడీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో చాలా చోట్ల దాడులు జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేశారు. సర్వసభ్య సమావేశం సజావుగా జరిగేందుకు పోలీసులు బందోబస్తు చేపట్టారు. సర్వసభ్య సమావేశానికి వందలాది మంది టీడీపీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, నేమకల్లు గ్రామ రైతులు

అనంతపురం అర్బన్: పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ, రైతు సంఘం నాయకులు, రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. బొమ్మనహళ్ మండలం నేమకల్లు, హిరిదేహల్ వద్ద కంకర్ మిషన్లు, స్టీల్ ప్లాంట్లు, తదితర పరిశ్రమల ఉంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో వాతావరణ కాలుష్యం అవుతోందన్నారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దుళితో కలుషితంగా మారిన గాలిని పిల్చడం ద్వారా అస్తమా, చర్మవ్యాధులు వ్యాపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక కంకర మిషన్ల ద్వారా వెలువడుతున్న దుమ్ము పంటలపై పడటంతో పంటలు నష్టపోతున్నారన్నారు. పరిశ్రమల యాజమాన్యాలకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను, ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యంపై ఉందని గుర్తు చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రామకృష్ణ, కుళ్ళాయిస్వామి, నాగార్జున, తిప్పేస్వామి, గురుస్వామి, రైతులు మల్లప్ప, వణికేరప్ప, రామాంజనేయులు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

‘తుపాకీతో చంపుతానని బెదిరిస్తున్నాడు’



మాట్లాడుతున్న తగరకుంట పరంధామ రెడ్డి

అనంతపురం: కుటుంబ సభ్యులను చంపుతానని తమ బాబాయి తగరకుంట కమలనాభ రెడ్డి బెదిరిస్తున్నాడని తగరకుంట కొండా రెడ్డి కుమారుడు పరంధామ రెడ్డి సోమవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం తల్లి తగరకుంట ప్రభావతితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నర కిందటే మా అమ్మ, నేను ఊరు వదలి అనంతపురానికి వచ్చామన్నారు. ఇక్కడ షాపు పెట్టుకోవాలని అనుకున్న సమయంలో మా బాబాయ్ కమలనాభ రెడ్డి వచ్చి తుపాకీతో చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని పేర్కొన్నారు. ఆ రోజే మిస్ ఫైర్ కావడంతో మేము బతికిపోయామన్నారు. మా పొలం కోసం వెళ్లి ఉంటే అక్కడ కూడా ఇబ్బంది పెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. పావని ఆస్పత్రి వద్ద ఉండే స్థలం మా నాన్న తగరకుంట కొండా రెడ్డి పేరుతోనే ఉన్నప్పటికీ.. మాకు దక్కకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. తక్షణమే తుపాకీని స్వాధీనం చేసుకుని, కుటుంబ సభ్యులను కాపాడాలని పోలీసులకు విన్నవించారు.

వర్షాకాలంలో ముందస్తు చర్యలు చేపట్టాలి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మేయర్ వసీం నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని 38, 39వ డివిజన్లలో మేయర్ పర్యటించారు. కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు. నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో కాలువల్లో పూడికతీత పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. వర్షపు నీరు కాలువల్లో ఎటువంటి ఆటంకం లేకుండా వెళ్లేలా చూడాలని సూచించారు. ప్రధానంగా పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలని ఆదేశించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదని, నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలని ప్రజలకు తెలిపారు. మేయర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, చింతకుంట మధు తదితరులు ఉన్నారు.

వేడుకగా బాబయ్య బ్రహ్మోత్సవాలు



పీర్ల స్వాములకు చక్కెర చదివింపులు చేస్తున్న ముల్లా సాహెబ్ జాఫర్‌వలి

అనంతపురం కల్చరల్: మొహర్రం సందర్భంగా నగరంలోని పలు వీధుల్లో కొలువుదీరిన పీర్లస్వాములు విశేష పూజలందుకుంటున్నాయి. స్థానిక నాల్గవ రోడ్డులో సోమవారం రాత్రి చిన్న సరిగెత్తు వేడుకలు కనుల పండువగా జరిగాయి. పెద్ద పీర్ల మకానంలో కొలువుదీరిన హజరత్ సయ్యద్ పెనుగొండ బాబయ్య స్వామి పీర్ల వద్ద భక్తులు బారులు తీరి చక్కెర చదివింపులు చేశారు. అనంతరం రాత్రి పొద్దుపోయే వరకు యువకులు భక్తిగీతాలను పాడుకుంటూ పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు విశ్వనాథ్ మాట్లాడుతూ.. హజరత్ సయ్యద్ పెనుకొండ బాబయ్య స్వామికి గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయన్నారు. 17న పానకాలు, 18న అగ్నిగుండ ప్రవేశం అనంతరం సాయంత్రం జలధికి పోతాయన్నారు. 20న చివరి దర్శనం ఉంటుందని తెలిపారు.

నేడు పెద్ద సరిగెత్తు..

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు కొనసాగుతున్నాయి. ఆత్మకూరులోని పీర్ల మసీదులో భక్తులు పీర్ల స్వాములకు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. సయ్యద్ సర్దార్ వలి దర్గాలో పూలమాలలు వేసి ఫాతెహాలు చేశారు. మంగళవారం పెద్ద సరిగెత్తు, బుధవారం ఉదయం పీర్ల స్వాముల ఊరేగింపు, సాయంత్రం జలధి కార్యక్రమం ఉంటాయని గ్రామస్తులు తెలిపారు.

బాలకృష్ణ కొట్టాలలో రోడ్డు మూసేశారు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని బాలకృష్ణ కొట్టాలలో ఏళ్ల తరబడి ఉన్న రస్తాను కొందరు నిర్మాణం పేరుతో మూసేస్తున్నారు. ఇలా చేస్తే మా రాకపోకలకు ఇబ్బంది అవుతుందని చెబితే దౌర్జన్యం చేస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన సాహెబ్ బీ నగరపాలక సంస్థ అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం నగరపాలక సంస్థలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ శ్రీహరి బాబుకు వినతిపత్రం అందజేసింది. ఇప్పటికే గోడను పూర్తి స్థాయిలో అడ్డుగా నిర్మాణం చేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని సాహెబ్‌బీ అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన టీపీఓ శిరీషకు పరిశీలించాలని ఆదేశించారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు. స్పందనకు 13 ఫిర్యాదులొచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, డీఈ చంద్రశేఖర్, నగరపాలక సంస్థ సిబ్బంది సంధ్య, సునీల్, తదితరులు పాల్గొన్నారు.